క్లుప్తంగా

తెగుళ్ళ నివారణ పై రైతులకు అవగాహన



తెనాలిటౌన్: పంటల్లో వచ్చే తెగుళ్ళ నివారణ పై రైతులు అవగాహన కలిగి ఉండాలని బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు సూచించారు. రూరల్ మండలం కొలవరం గ్రామంలో మంగళవారం వ్యవసాయ కళాశాల విద్యార్థులు పర్యటించి రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. జీవామృతం తయారీ, స్ప్రే ద్రావణాలు ఎంత మోతాదాలో తయారీ, తెగుళ్ళ నియంత్రణకు సేంద్రీయ పద్ధతిలో ఉపయోగపడే ఏలో స్టిక్ ట్రాప్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు శాంతి, సుధ, శిరీష, సౌమ్య, సింధూజ, రేవతి, రాధిక, రమ్య, రైతులు వెంకటరెడ్డి, సాంబిరెడ్డి, శ్రీనివాసరావు, రాములు పాల్గొన్నారు.

మురుగు కాల్వలను బాగు చేయండి

కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: మురుగు కాల్వలను ప్రతి రోజు బాగు చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. 37వ వార్డులో మంగళవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కొన్ని కాల్వలు వ్యర్థాలతో ఉండి ఉండటాన్ని గమనించిన ఆయన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వాటిని బాగు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

నేడు కొలకలూరులో ఉచిత వైద్య శిబిరం

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో బుధవారం ఉదయం 9 గంటలకు ఉచిత మెగా వైద్య శిబిరం జూబ్లీ ఇంగ్లిషు మీడియం స్కూల్ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ ఆధ్వర్యంలో దుగ్గిరాల ఫ్రెండ్స్ ఫౌండేషన్ మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ సభ్యులు మంగళవారం తెలియజేశారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే శిబిరంలో షుగర్, బీపీ, మోకాళ్ళ నొప్పులు, కీళ్ళ నొప్పులు, ఆయాసం, కంటి, దంత సంబంధిత వ్యాధులకు రక్త పరీక్షలు, ఎక్స్‌రే, ఈసీజీ ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

యుద్ధంలో అమరులైన సైనికులకు ఘన నివాళి



తెనాలిటౌన్: భారత్-పాక్ యుద్ధంలో ప్రాణాలకు తెగించి పోరాడి అమరులైన భారత్ సైనికులకు పట్టణంలో ఘన నివాళులర్పించారు. స్థానిక మెయిన్‌రోడ్డులో మంగళవారం అమర జవాన్ మురళీనాయక్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన త్యాగాన్ని దేశం మరువదని నినదించారు. కార్తిక్ శారీ మందిర్, పాపులర్ వారి సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కడియాల శ్రీనివాసరావు, పెండ్యాల పూర్ణ, రామవత్ బాబునాయక్, వి.శ్రీమన్నారాయణ, ఆలపాటి శివ, గుర్రం సీతారామయ్య, కె.హరికిషోర్, తదితరులు ఉన్నారు.

వృద్ధురాలి మృతదేహానికి అంత్యక్రియలు

తెనాలిటౌన్: గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహానికి మంగళవారం హెల్పింగ్ సోల్జర్స్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. స్థానిక బస్టాండ్ ప్రాంతంలోని కెఆర్ స్కూల్ పరిసరాల్లో గుర్తు తెలియని వృద్ధురాలు అనారోగ్యంతో చనిపోయింది. స్థానికుల సమాచారంతో హెల్పింగ్ సోల్జర్స్ ప్రతినిధులు ఆ ప్రాంతానికి చేరుకుని వృద్ధురాలి మృతదేహాన్ని అక్కడి నుంచి తరలించి పట్టణ బుర్రిపాలెం రోడ్డులోని హిందూ శ్మశానవాటికలో ఖననం చేశారు.

విజిలెన్స్ తనిఖీలు

మంగళగిరి: విద్యుత్ విజిలెన్స్ అధికారులు మంగళగిరి పరిధిలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. సీహెచ్ వెంకటేశ్వరరావు, జే సంజీవరావుల ఆధ్వర్యంలో 46 మంది అధికారులు, 189 మంది మొత్తం 46 బృందాలుగా ఏర్పడ్డారు. 3,121 సర్వీసులను తనిఖీ చేశారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఇద్దరికి రూ 0.53 లక్షలు, అనుమతించిన కేటగిరీ కాకుండా ఇతరాల్లో విద్యుత్ వాడుకుంటున్న 9 మందికి రూ 1.20 లక్షలు, అనుమతించిన లోడు కంటే అదనంగా వాడుకుంటున్న 124 మందికి రూ 10.37 లక్షలు కలిపి మొత్తం రూ.12.10 లక్షల జరిమానా విధించినట్లు తెలిపారు. కాంపౌండింగ్ పద్ధతిలో జరిమానా విధించడం జరుగుతుందని వివరించారు.

ప్రమాదభరితంగా.. ఖాళీ స్థలాలు

- విషసర్పాలు, దోమలతో ప్రజలు అవస్థలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు

తెనాలిఅర్బన్: పట్టణంలోని ఖాళీ స్థలాలు ప్రమాదభరితంగా మారాయి. వాటిలో పిచ్చి మొక్కలు మొలచి విషసర్పాలకు, దోమలకు అవి నిలయాలుగా మారాయి. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. తెనాలి పట్టణం రోజురోజుకు విస్తరిస్తుండటం... గుంటూరు, విజయవాడకు అతి దగ్గరగా ఉండటం, జిల్లాలో గుంటూరు తర్వాత అతి పెద్ద పట్టణంగా తెనాలి రూపుదిద్దు కోవడంతో ఇక్కడ నివశించేందుకు ప్రజలు ఎక్కువ ఆసక్తిని కనపర్చుతూ ఉంటారు. అంతేకాకుండా తెనాలి పట్టణంలో తాగు నీటి కొరత కూడా ఉండదు. దీంతో పల్లెలలో నివశించే వారు, ఉద్యోగ రీత్యా ఇక్కడికి వచ్చిన వారు తెనాలిలో స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుంటూ ఉంటారు. ప్రస్తుతం తెనాలి పట్టణంలో 2.32 లక్షలకు పైగా జనాభా ఉన్నరంటే తెనాలి ఏ స్థాయిలో అభివృద్ధి చెందుతుందో మనకు అర్థమౌతుంది. జనాభా పెరిగిన రీతిలోనే స్థిర నివాసాలు పెరుగుతున్నాయి.

సుమారు నాలుగు వందలకు పైగా ఖాళీస్థలాలు

తెనాలి పట్టణంలో ఇళ్ల మధ్య సుమారు 400కు పైగా ఖాళీ స్థలాలు ఉన్నాయనేది అధికారుల అంచనా. వీటిలో పిచ్చి మొక్కలు పెరిగి విష సర్పాలకు, పురుగులకు, పందులకు నిలయంగా మారుతున్నాయి. అంతేకాకుండా స్థలాలు పల్లంలో ఉండటం వల్ల సమీపంలోని మురుగు నీరు, వర్షపు నీరు దానిలో చేరి దుర్గంధ భరితంగా మారుతున్నాయి. దీంతో ప్రజలు తరచు వాటిని బాగు చేయించాలని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదులు చేస్తున్నారు.

గతంలో వేకెంట్ ల్యాండ్ యాప్‌తో చర్యలు

తెనాలి మున్సిపల్ అధికారులు ఖాళీ స్థలాలను బాగు చేయించేందుకు వేకెంట్ ల్యాండ్ అనే ప్రత్యేక యాప్‌ను గతంలో రూపొందించారు. దానిలో ఖాళీ స్థలాలను నమోదు చేసి, వాటి యజమానులకు నోటీసులు ఇచ్చి వాటిని బాగు చేయించేవారు. యజమానుల ఆచూకీలేని స్థలాలను మున్సిపల్ సిబ్బందితో బాగు చేయించి దానికి అయిన ఖర్చును దానిలో నమోదు చేసేవారు. ఎప్పుడైనా ఆస్థల యజమానులు భవన నిర్మాణ ప్లాన్‌కు వచ్చినప్పుడు వారి నుంచి స్థలం బాగు చేయించినందుకు అయిన ఖర్చును వసూలు చేసి తర్వాత నో అబ్జెక్షన్ సర్టిఫికెట్‌ను ఇచ్చి ప్లాన్ ఇచ్చే వారు. ఇలా మూడు సంవత్సరాలు జరిగిన తర్వాత దాని ఊసే అధికారులు మరిచారు. ఇదిలా ఉంటే గతంలో అధికారులు నోటీసులిచ్చి స్పందించిన యజమానులకు బుద్ధి చెప్పేందుకు వారి స్థలాలలో ఇది మున్సిపల్ స్థలం అనే బోర్డులు ఏర్పాటు చేశారు.



ఖాళీ స్థలాల్లో మున్సిపల్ బోర్డులను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

నోటీసులు అందజేస్తున్నాం

తెనాలి పట్టణంలోని ప్రభుత్వ స్థలాల్లో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. కొద్ది రోజుల్లో ఆ పని ప్రారంభమవుతుంది. అలాగే పట్టణంలోని ప్రవేట్ స్థలాల యాజమానుల వివరాలు సేకరిస్తున్నాం. వివరాలు వచ్చిన వెంటనే సంబంధిత స్థల యాజమానులకు నోటీసులు ఇచ్చి వాటిని బాగు చేయించాలని సూచిస్తాం. వారి వివరాలు తెలియని పక్షంలో తెనాలి పురపాలక సంఘం బాగు చేయించి వారి వద్ద నుంచి ఆ నగదును వసూలు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం.

– బండి శేషన్న, కమిషనర్, తెనాలి పురపాలక సంఘం

సీబీఎస్ఈ ఫలితాల్లో వివేక' జయభేరి

పదోతరగతిలో ఆరిపున్నిసా బేగంకు 489/500 మార్కులు



ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులతో వీరనారాయణ, వెంకట్రామ్ ప్రభృతులు

తెనాలి: సీబీఎస్ఈ 10వ తరగతి 12వ తరగతి పరీక్షల్లో స్థానిక వివేకానంద సెంట్రల్ స్కూలు విద్యార్థులు అద్భుత ఫలితాలను సాధించారని వివేక విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ చెప్పారు. ఆయా తరగతుల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మంగళవారం సాయంత్రం ఏర్పాటైన సభలో ఘనంగా సత్కరించారు. మంగళవారం విడుదలైన సీబీఎస్ఈ పదోతరగతి పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థిని షేక్ ఆరిపున్నిసా బేగం 489/500 మార్కులు సాధించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభను చాటినట్టు ఆయన చెప్పారు. వీరితోపాటు జవ్వాది లిఖిత, కార్తీక్ మైలా, చంద్రహాసిని 95 శాతం మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. బి.లక్ష్మీసుజాత, వై.మనోహర్, ఎ.భీమల్‌రాజేంద్ర, బసీరున్నిసా 92 శాతం మార్కులు సాధించారని తెలిపారు.

పదోతరగతి పరీక్ష రాసిన విద్యార్థులంతా 60 శాతం పైగా మార్కులతో ఉత్తీర్ణులు కావటం గర్వకారణమన్నారు. అలాగే 12వ తరగతిలో ఎంపీసీ గ్రూపులో కే.దేవికాసాయి 94 శాతం, బైపీసీలో కొడాలి శ్రీఅంజన 93.6 శాతం మార్కులతో ఉత్తీర్ణులైనట్టు తెలిపారు. వెంకటనాగప్రతిమ, ఎస్.దీపిక 90 శాతం పైగా మార్కులు సాధించారని, పరీక్షకు హాజరైన విద్యార్థులందరూ ఉత్తీర్ణులైనట్టు వివరించారు. ఈ ఏడాది జరిగిన అన్ని పరీక్షల్లో వివేక విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ మార్కులను సాధించటం గర్వకారణమన్నారు. అభినందన కార్యక్రమంలో వివేకానంద సెంట్రల్ స్కూల్ సీఈవో ఆర్.వెంకట్రామ్, ఉదయ్‌కిరణ్, మురళి, రాంబాబు, రాజేష్, శివకుమార్, మంగమ్మ పాల్గొన్నారు.

సీబీఎస్ఈలో వెస్ట్‌బెర్రీ నూరుశాతం ఉత్తీర్ణత

తెనాలి: 2024–25 సంవత్సర సీబీఎస్ఈ పరీక్షా పరీక్షల్లో స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని వెస్ట్‌బెర్రీ పాఠశాల విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణతను సాధించారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో 10వ తరగతి, 12వ తరగతి విద్యార్థులంతా అత్యుత్తమ ఫలితాలతో ఉత్తీర్ణులైనట్టు పాఠశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలియజేశారు. 12వ తరగతిలో తమ విద్యార్థులు కార్తిక ఎంపీసీలో 89 శాతం, విద్యాగంగ బైపీసీలో 87.4 శాతం, శిఖర్‌జైన్ బీఈసీలో 86 శాతం మార్కులతో ఉత్తీర్ణులైనట్టు తెలిపారు. ఇన్ఫర్మేషన్ ప్రాక్టీసెస్‌లో హిమాజ, అక్షిత, కార్తిక, విద్యాగంగ, శ్రేయలు వంద మార్కులు సాధించారని తెలిపారు. పదోతరగతిలోఎం.నమ్రత 97.2 శాతం మార్కులు సాధించగా, 16 శాతం విద్యార్థులు 90 శాతంపైగా, 52 శాతం విద్యార్థులు 80 పైగా, 68 శాతం విద్యార్థులు 75 పైగా, 98 శాతం మంది విద్యార్థులు 60 శాతంపైగా మార్కులు సాధించినట్టు వివరించారు. వీరందరికీ ప్రిన్సిపాల్ అభినందనలు తెలియజేశారు.

వసతిగృహాల్లో దోమల నియంత్రణకు చర్యలు



తెనాలిఅర్బన్: దోమల నియంత్రణకు ఆర్‌ఆర్ నగర్‌లోని గిరిజన, షెడ్యూలు కులాల బాలికల వసతిగృహాల్లో చేపట్టిన మలాథియాన్‌తో పిచికారీ చేసిన మందును మంగళవారం స్ప్రై చేశారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ మాట్లాడుతూ పిచికారీ చేసిన మందును స్ప్రై చేయడం వలన దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు విద్యార్థినీలకు సోకే అవకాశం లేదని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్యవిస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, సిబ్బంది దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరరావు, దాసరి శివనాగమల్లేశ్వరరావు, షేక్ నవీద్, షేక్ రఫీదు, తదితరులు పాల్గొన్నారు.

20న జరిగే సమ్మెలో పాల్గొనాలి



వైద్యాధికారిణికి సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

తెనాలిఅర్బన్: సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 20వ తేదీన సమ్మె చేస్తున్నట్లు సీఐటీయూ నాయకులు పి.శ్యామల, ఎం.వాణి ప్రకటించారు. ఏపీ యునైటెడ్ విలేజ్ అండ్ వార్డు హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం నందులపేట, మారీసుపేటలోని అర్బన్‌హెల్త్ సెంటర్ల వైద్యాధికారులకు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లెబర్ కోడ్‌లు రద్దు చేయాలని, ఉద్యోగులకు కనీస వేతనం రూ.20 వేలు అందజేయాలని డిమాండ్ చేశారు. రద్దు అయిన 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించి పనిభారం తగ్గించాలని కోరారు. ఒక్క రోజు జరిగే సమ్మెలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కె.రాజ్యం, సిహెచ్.సుమిత్ర, ఎ.పుష్పకుమారి, ఎ.సుమతీ, జె.తులసీ, కె.సువార్తరాణి, పి.రాధాపావని, సి.హెచ్.సిరోమణి, షేక్ సంధ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కెబి.ప్రసాద్, షేక్ హుస్సేన్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవాలు



అన్నదానంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలవరం గ్రామం రాజుల కాలనీలో వేంచేసియున్న శ్రీ మద్వి విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు అంగరంగ వైభవంగా ముగిశాయి. మంగళవారం దేవస్థానం వద్ద గ్రామ ప్రజానీకానికి భారీ అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ సర్పంచ్ గంపల శివనాగేశ్వరరావు పాల్గొని అన్నదానం చేశారు. ఈ నెల 7వ తేదీన ప్రారంభమై 12వ తేదీ వరకు అనేక సాంఘిక, పౌరాణిక నాటకాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయని ఆయన పేర్కొన్నారు. భక్తి శ్రద్ధలతో ప్రతిరోజు స్వామి వారికి పూజాధి కార్యక్రమాలు, ఆత్మానంద సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పూసపాటి కొండంరాజు, బి.ఏడుకొండలరాజు, శ్రీనివాసరాజు, వెంకమ్మరాజు, కె.నరసరాజు, సిద్ధం రాజు, మాలకొండం రాజు, శ్రీనివాసరాజు, కృష్ణంరాజు, నారంరాజు, గోపికృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడిక తీత

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రత్నాల చెరువు మురుగు కాలువలలో పూడిక తీత పనులు మంగళవారం ప్రారంభించారు. మురుగు కాలువలలో చెత్త పేరుకుపోయి ప్రవాహం సజావుగా సాగని ప్రాంతాలను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాషా తెలిపారు. కార్పొరేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో చెత్త పేరుకుపోవడంతో ఈ పనులు చేపట్టినట్లు వివరించారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎక్కడైనా మురుగు నీరు నిలిస్తే వెంటనే సంబంధిత సచివాలయంలోని పారిశుద్ధ్య సిబ్బందికి తెలియజేయాలని ప్రజలను కోరారు.

మానసిక సమస్యలకు టోల్‌ఫ్రీ నంబరు



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రావణి

మంగళగిరి టౌన్: మంగళగిరి ఎయిమ్స్ సైక్రియాట్రీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరానగర్ యూపీహెచ్‌సీలో టెలి-మానస్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సైక్రియాట్రిస్ట్ డాక్టర్ శ్రావణి మాట్లాడుతూ.. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో టెలి-మానస్ పేరిట 14416 టోల్‌ఫ్రీ నెంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారని అన్నారు. ఎలాంటి మానసిక సమస్యలు ఉన్నా నెంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ట్రైన్డ్ కౌన్సిలర్లు తగిన సహాయం చేస్తారని తెలిపారు. సమస్య పెద్దగా ఉన్న పక్షంలో దగ్గరలోని సైక్రియాట్రిస్ట్‌కు రిఫర్ చేస్తారని పేర్కొన్నారు.

ఈ సర్వీస్ 24 గంటలు అందుబాటులో ఉంటుందన్నారు. వివరాలు గోప్యంగా ఉంచుతారని తెలిపారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు తమ పరిధిలోని ప్రజలకు టెలి-మానస్‌పై అవగాహన కల్పించాలని కోరారు. మంగళగిరి ఎయిమ్స్‌లోని సైక్రియాట్రీ విభాగంలో వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఇందిరానగర్ యూపీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ అనూష మాట్లాడుతూ కొన్ని సమస్యలు కౌన్సెలింగ్ ద్వారా తీరతాయని తెలిపారు. మందుల ద్వారా కూడా వైద్యం అందుబాటులో ఉంటుందని వివరించారు. మందులతో నయం కాని వారికి వేరే పరికరాలతో ట్రీట్‌మెంట్ ఇస్తామని పేర్కొన్నారు. యోగ, ధ్యానం, వ్యాయామం అలవాటు చేసుకోవాలని సూచించారు.

తల్లిదండ్రులకు సేవ చేసిన వారికి సౌభాగ్యం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై జగత్‌గురువు శ్రీశంకరాచార్యులు రచించిన మాతృదేవోభవ అనే అంశంపై రెండు రోజులు జరిగే ప్రవచనాలు మంగళవారం మొదలయ్యాయి. ఆలయ పాలక మండలి అధ్యక్షులు సి.హెచ్.మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, సహాయ కార్యదర్శి వూటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. సుందర సత్సంగ్ సభ్యులు, శ్రీసుందరచైతన్యానందస్వామి శిష్యులు కేవీ కోటేశ్వరరావు మాట్లాడుతూ భగవంతుడి ప్రతిరూపమే తల్లి అన్నారు. ప్రాణం ఉన్నంత కాలం తల్లిదండ్రులకు సేవలు చేసిన వారికి సౌభాగ్యం, నిరంతరానందం కలుగుతుందని పేర్కొన్నారు. త్యాగం, ప్రేమ, సేవ, చింతనకు మారుపేరు తల్లి అని అన్నారు. తల్లికి మించిన దైవం లేదన్నారు. సృష్టికి మూలం అమ్మ అని, సృష్టించలేనిది తల్లి గుణం పేర్కొన్నారు. కళ్లకు కనిపించే పర దేవతే తల్లి అని జగత్ గురు శంకరాచార్యులు మాతృపంచకంలో వివరించారని గుర్తుచేశారు. భగవంతుని అమ్మ స్వరూపంతో, మాతృభక్తితో కొలిచినప్పుడు భూలోక సౌఖ్యాలు పొందవచ్చునని అన్నారు.

ఇందిరమ్మా.. ఎన్నాళ్లకు కనిపించావమ్మా!

సాక్షి ఎఫెక్ట్

తెనాలి: 'మాజీ ప్రధానికి ఇచ్చే గౌరవం ఇదేనా' శీర్షికతో ఈనెల 10న 'సాక్షి' తెనాలి జోన్‌లో ప్రచురితమైన వార్తా కథనానికి స్పందన లభించింది. బోసురోడ్డులోని శ్రీసీతారామమందిరం సెంటర్లోని మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ కాంస్య విగ్రహానికి అడ్డుగా ఏర్పాటుచేసిన మున్సిపాలిటీ ప్రచార ఫ్లెక్సీని ఏట్టకేలకు తొలగించారు. కనీసం విగ్రహమైనా కనిపించకుండా దిగువన పెడస్టల్ నుండి విగ్రహం పైవరకు నిలువెత్తున మున్సిపాలిటీనే ప్రచార ఫ్లెక్సీని కట్టటం తీవ్ర విమర్శలకు గురయింది. పట్టణంలో మాజీ ప్రధాని ఇందిర కాంస్య విగ్రహం ఉన్నది ఇక్కడ ఒక్కచోటనే. అదికూడా కనిపించకుండా చేయటం పట్టణంలో చర్చనీయాంశమైంది. దీనిపై 'సాక్షి'లో ప్రచురితం కావటంతో తొలగించారు.



'బీట్ ది హీట్' కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

సబ్ కలెక్టర్ సంజన సింహా



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ సంజన సింహా

తెనాలిఅర్బన్: పట్టణంలో శనివారం జరిగే ''బీట్ ది హీట్'' కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని తెనాలి సబ్‌కలెక్టర్ సంజన సింహా పిలుపునిచ్చారు. పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో మంగళవారం సాయంత్రం బీట్ ది హిట్ కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వర్ణంధ్ర – స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా దీనిని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వేసవి తాపాన్ని తట్టుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. తహసీల్దార్ గోపాలకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా స్వర్ణాంధ్ర – స్వచ్ఛంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తుందని చెప్పారు. ప్రతి నెల 3వ శనివారం వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. డిసెంబర్ 2025 వరకు ఇది జరుగుతుందని వివరించారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ బీట్ ది హిట్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. శనివారం పట్టణంలో వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. సమావేశంలో ఇండియన్ టుబాకో కంపెనీ సీవో ఉమాకాంత్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, ఉద్యోగులు, కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయండి

చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



కమ్యూనిటీ హాల్‌ను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కౌన్సిలర్ సురేంద్ర

తెనాలిఅర్బన్: పొట్టి శ్రీరాములు మున్సిపల్ పార్కులోని అంబేడ్కర్ లైబరీ, కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఆదేశించారు. పట్టణంలోని 1, 7, 9, 10, 40 వార్డుల్లో మంగళవారం ఆమె పర్యటించారు. ఐతానగర్‌లోని పొట్టి శ్రీరాములు మున్సిపల్ పార్కులోని నిర్మాణ పనులను కౌన్సిలర్ గెడ్డటి సురేంద్రంతో కలసి పరిశీలించి పలు సూచనలు చేశారు.

అలాగే చిట్టి ఆంజనేయస్వామి గుడి నుంచి గురవయ్య కాలనీ వరకు ఉన్న జంపని పంట కాల్వ పూడికతీత పనులను పరిశీలించారు. పూలే కాలనీలో మంచి నీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో 10వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు కఠారి హరీష్, ఏఈ సూరిబాబు, టీపీవో సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

20న దేశవ్యాప్త సమ్మెలో ఉపాధి కూలీలు పాల్గొనాలి



ఉపాధి కూలీలతో ములకా శివసాంబిరెడ్డి

తెనాలి: దేశవ్యాప్తంగా ఈనె 20న జరిగనున్న సార్వత్రిక సమ్మెలో ఉపాధి హామీ కూలీలు కూడా పాల్గొనాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివ సాంబిరెడ్డి కోరారు. తెనాలి రూరల్ గ్రామం గుడివాడలో ఉపాధి పనులు జరుగుతున్న పని ప్రదేశంలో కూలీలను మంగళవారం ఆయన కలిసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్ అమలు జరిపితే సంఘం పెట్టుకునే హక్కును కార్మిక వర్గం కోల్పోతుందని చెప్పారు. కార్మికవర్గం సమ్మెకు కౌలురైతులు, రైతు వ్యవసాయ కార్మిక సంఘాలు గ్రామీణ హర్తాళ్‌కు పిలుపునిచ్చాయని తెలిపారు గతంలో ఉపాధి కూలీలకు సమ్మర్ అలవెన్స్, మజ్జిగ, మంచినీరు, మెడికల్ కిట్ వంటివి ప్రభుత్వం అందుబాటులో ఉంచేదని గుర్తుచేశారు. ప్రస్తుతం నరేంద్ర మోదీ ప్రభుత్వం వాటిని రద్దు చేసిందని చెప్పారు. కార్మిక వర్గానికి మద్దతుగా ఉపాధి కూలీలు కూడా సమ్మెలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీల సమస్యలు పరిష్కరించండి



సీడీఎంఏ కమిషనర్ డాక్టర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ నాయకులు

తెనాలిఅర్బన్: వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీల సమస్యలను పరిష్కరించాలని సీడీఎంఏ కమిషనర్ డాక్టర్ సంపత్‌కుమార్ ఐఏఎస్‌ను ఆంధ్రప్రదేశ్ స్టేట్ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ అసోసియేషన్ నాయకులు కోరారు. మంగళగిరిలోని ఆయన కార్యాలయంలో మంగళవారం నాయకులు కలిసి వినతిపత్రం ఇచ్చారు. ప్రమోషన్‌లను వెంటనే ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పీజీ గణేష్‌కుమార్, గౌరవాధ్యక్షుడు మహాదేవ ఆనందరావు, ప్రధాన కార్యదర్శి శేషుబాబు,నాయకులు దుర్గాప్రసాద్, సిహెచ్ బంగారు రాజు, బెల్లంకొండ పాండురంగ, అసోసియేషన్ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు కిరణ్మయి పాల్గొన్నారు.

పేదలకు రూ.పది వేలు పెన్షన్ ఇవ్వాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న జొన్న శివశంకరరావు

తాడేపల్లి రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో 60 సంవత్సరాలు నిండిన పేదలకు రూ.వేలు పెన్షన్‌గా అందజేయాలని ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల నాయకులు ఈ నెల 20వ తేదీన నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని మంగళవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని చిర్రావూరు గ్రామంలో కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతన చట్టం ప్రకారం కార్మికులకు నెలకు రూ.26 వేల వేతనం చెల్లించాలని అన్నారు. విద్యుత్ చట్ట సంస్కరణలను ఎత్తివేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరుగు సమ్మెలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకట రెడ్డి సీఐటీయూ తాడేపల్లి మండల నాయకులు పల్లెకృష్ణ, రైతు సంఘం మంగళగిరి మండల నాయకులు ఎం.పకీరయ్య పాల్గొన్నారు.